క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కారంచేడు: మండలంలోని కుంకలమర్రు గ్రామంలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గ్రామంలో విద్యుత్ సరఫరా జరగదన్నారు. 11 కేవీ కుంకలమర్రు ఫీడర్‌లో ఉన్న సమస్యలను గుర్తించి మరమ్మతులు చేస్తామన్నారు. గ్రామస్తులు గమనించి సహకరించాలని కోరారు.

బల్లికురవ: సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ, ఏఈలు ఎన్ సురేంద్రబాబు, కె. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. వెలమవారిపాలెం, సంతమాగులూరు మండలంలోని పుట్టావారి పాలెం (అడ్డరోడ్డు) ఫీడర్లలో సరఫరా నిలుపుదల చేసామన్నారు.

జె.పంగులూరు: మండల పరిధిలోని రామకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల రామకూరు ఫీడర్‌లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ గోరంట్ల అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం, మఘనక్షత్రం, సప్తమి తిధి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



చిన్నారులు వారి తల్లి దండ్రులతో కోలాహలంగా ఉన్న చిల్డ్రన్స్ పార్కు



ఫైబర్ జారుడు బల్లపై ఆడుతున్న చిన్నారులు

ఉల్లాసం.. ఉత్సాహం!

- కోలాహలంగా మున్సిపల్ చిల్డ్రన్స్ పార్కు
- పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో బారులు తీరుతున్న విద్యార్థులు
- పలు రకరకాల ఆట వస్తువులతో ఎంజాయ్
- డీజే సౌండ్స్‌తో నృత్యాలు
- వైఎస్సార్ సీపీ హయాంలో భారీగా నిధులు మంజూరు



కొత్తరకం ఆట వస్తువుపై ఆడుకుంటున్నచిన్నారులు

చీరాల రూరల్: ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు ఎదురుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ చిల్డ్రన్స్ పార్కు చిన్నారులతో కోలాహలంగా మారుతోంది. విద్యార్థులకు వేసవి సెలవులు ఇవ్వడంతో పార్కులోని రకరకాల ఆటవస్తువులతో విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎంజాయ్ చేస్తూ సేద తీరుతున్నారు. ఏడేళ్ల క్రితం చిల్డ్రన్స్ పార్కు పేరుతో మున్సిపల్ కార్యాలయం వెనుక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలుకు ఎదురుగా ఎంతో సువిశాల ప్రదేశంలో చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. పార్కును ఏర్పాటు చేసిన సమయంలో అనేక రకాలు ఆట వస్తులతో పాటు పచ్చదనం కోసం మంచి క్రోటన్ మొక్కలను ఏర్పాటు చేశారు. కొంతకాలం పాటు చిన్నారులు పార్కులోని ఆట వస్తువులతో ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా పాఠశాలలకు వేసవి సెలవుల సమయంలో పార్కు చక్కగా ఉపయోగపడింది. ప్రతిరోజూ చిన్నారులు సాయంత్రం సమయంలో ఆటవస్తువులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎంజాయ్ చేస్తున్నారు. అయితే కొన్ని ఆటవస్తువులు కాలక్రమేణా మూలన పడటంతో మరలా కొత్త ఆటవస్తువులను మున్సిపాలకులు సమకూర్చారు. కొత్త ఆట వస్తువుల స్థానంలో జారుడుబల్ల పాతది అలానే ఉంచారు. జారుడుబల్ల పాతది కావడంతో రెండుచోట్ల రేకు తప్పుపట్టి పగిలి ప్రమాద భరితంగా మారింది. దానిపైనే చిన్నారులు ఆడుకుంటూ జర్రున జారుతున్నారు. పగిలిపోయిన రేకు చిన్నారుల కాళ్లకు గుచ్చుకుంటే సెప్టిక్ అయ్యే ప్రమాదం ఉన్నా అధికారులు దానిని మాత్రం తొలగించలేదు.

డీజే సౌండ్స్‌తో పాటలకు నృత్యాలు

పార్కు మధ్యలో పెద్ద స్టేజీ ఏర్పాటు చేశారు. స్టేజీపై డీజే సౌండ్స్‌తో మిరుమిట్లు గొలిపే విధంగా లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఒక్క ఆదివారం మాత్రమే వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం డీజే సౌండ్స్ మధ్య సినిమా టలకు చిన్నారులు నృత్యాలు ప్రదర్శిస్తు ఆనందంలో మునిగిపోతున్నారు.

రూ. 30 లక్షలతో బోటింగ్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం పర్యవేక్షణలో రూ. 30 లక్షల వ్యయంతో పార్కును మరింత అభివృద్ధి చేశారు. పార్కులో కొత్తగా బోటింగ్ ఏర్పాటు చేశారు. నీటిలో చిన్నచిన్న ఫైబర్ బోట్లను ఏర్పాటు చేశారు. దీంతో చిన్నారులు బోటులో ఎక్కి కాళ్లతో తొక్కుతూ నీటిని చేతులతో తాకుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చిన్నారులు నీటిలో బోటింగ్ చేస్తూ ఆనంద పరవశంలో మునిగిపోతున్నారు. మున్సిపాలకులు ఖర్చుకు వెనుకాడకుండా చీరాలకు కొత్త ఒరవడిని తీసుకురావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కొత్త హంగులు...

ఏడాది క్రితం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 50 లక్షలు వెచ్చించి పార్కులో పాడై పోయిన వస్తువులను తొలగించి పూర్తిస్థాయిలో రకరకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. చిన్నారులు పార్కులో ఆట వస్తువులతో ఎంజాయ్ చేయడమే కాకుండా పార్కులోని పచ్చిక మధ్య విహరిస్తున్నారు. మొత్తం మీద మున్సిపల్ చిల్డ్రన్స్ పార్కు వేసవి సెలవుల్లో చిన్నారులకు ఎంతో చక్కగా ఉపయోగ పడుతుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బోటింగ్ క్లబ్

సిబ్బందితో పర్యవేక్షిస్తున్నాం: పార్కులో చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చిన్నారులు ఆటలాడుకునే సమయంలో ప్రతిరోజూ మున్సిపల్ సిబ్బందిని చిన్నారులకు రక్షణగా ఏర్పాటు చేశాం. పార్కులో కొత్తగా రకరకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశాం. పార్కులో బోటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

– **రఘురామ్**, మున్సిపల్ డీఈ చీరాల



ముస్తాబైన నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం

రేపటి నుంచి కనక నాగవరపమ్మ సంబరాలు

వేటపాలెం: రావూరిపేట శివారులో పచ్చటి పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి సంబరాలు ఈ నెల 02 నుంచి 10 వ తేదీ వరకు జరగనున్నట్లు ఈఓ పోతిన శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. 2న సంతరావూరు గ్రామంలో మీసాల బాబూరావు ఇంటి వద్ద అమ్మవారి గిలకల మందిరంలో అమ్మవారి నిధి వస్తుందని తెలిపారు. 3న అమ్మవారి పావనం సముద్ర స్నానానికి బయలు దేరుతుంది. 5, 6 తేదీల్లో సంతరావూరు గ్రాములోని గ్రామస్తుల ఆర్థిక సహకారంతో అమ్మవారి కొలుపులు జరుగుతుంది. 7 న సంతరావూరులో పొంగళ్ల కార్యక్రమం ముగించు కొని శిడిబండి రావూరిపేటలోని అమ్మవారి దేవస్థానం వద్దకు చేరుతుంది. 8,9 తేదీల్లో వేటపాలెం పరిసర గ్రామాల్లో అమ్మవారి జోగి కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి దేవస్థానం ప్రాంగణలో రేణుకా యుద్ధం, సాంఘిక నాటక ప్రదర్శన జరుగుతుంది. 10న శిడి మహోత్సవంతో అమ్మవారి సంబరాలు ముగుస్తాయని ఈఓ తెలియజేశారు.

7 నుంచి గంగమ్మ తల్లి సంబరాలు

వేటపాలెం: స్థానిక పాకనాటి వీధిలో వేంచేసియున్న గంగమ్మ తల్లి సంబరాలు ఈ నెల 6 నుంచి 8 వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న పోలేరమ్మ అమ్మ వారికి వడపప్పు నైవేద్యాలు చెల్లింపులు, 7న ఉదయం మహాలక్ష్మీ అమ్మవారికి వరపప్పు, పానకాలు చెల్లింపు, సాయంకాలం నాగవరపమ్మకు వడపప్పు, పానకాలు చెల్లింపు జరుగుతుంది. 8న గంగమ్మ తల్లి ఊరేగింపు, వీరదాళ్ల సేవ కార్యక్రమంతో సంబరాలు ముగుస్తాయి.



గంగమ్మ తల్లి మూలవిరాట్



శ్రీ కనక నాగవరపమ్మ మూల విరాట్

కనుల పండువగా పోలేరమ్మ కొలుపులు



కారంచేడు: ఊరేగింపులో అమ్మవారి చిత్రపటం



కారంచేడు: విద్యుత్ దీపాలతో అలంకరించిన విద్యుత్ ప్రభ

- వీరతాళ్లతో నృత్యాలు చేసిన యువకులు

కారంచేడు: గ్రామ దేవత, అన్నదాతల ఇలవేల్పు పోలేరమ్మ తల్లి కొలుపులను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామస్తులంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో ఉండాలని ప్రజలు ఈ కొలుపులు చేయడం ఆనవాయితీ. ప్రతి ఏడాది సాగుకు ముందు గ్రామంలో ప్రాంతాల వారీగా ఈ కొలుపులు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చేసుకుంటారు. గ్రామంలోని యజ్ఞశాలపేటకు చెందిన అన్నదాతలు, యువకులు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున పోలేరమ్మకు పూజలు చేశారు. ఉదయం రెండు చెరువుల మధ్య కొలువైన అమ్మవారికి తలంటు స్నానాలు చేయించారు. మధ్యాహ్నం మేళతాళలతో అమ్మవారికి నైవేద్యాలను అర్పించారు. రాత్రికి అమ్మవారి చిత్రపటంతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో యువకులతో పాటు చిన్నారులు వీరతాళ్ళతో నృత్యాలు చేశారు. విచిత్ర వేషధారకణలు ఆకట్టుకున్నాయి. ఇంటింట అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది.

మమ్మేలు.. గంగమ్మ తల్లీ!



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



కారంచేడులో గంగమ్మకు మొక్కులు చేసుకుంటున్న భక్తులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. ఆదివారం వేకువజాము నుంచే ఆడపడుచులు పెద్ద ఎత్తున తలంటు స్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులు, గ్రామస్తులు, విద్యకు ముందుకు వెళ్తున్న విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలమ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జె.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల (1994–95) సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థుల ఆత్మీయ పలకరింపులు, గురువులకు ఘన సంత్కారంతో సందడి నెలకొంది. పూర్వ విద్యార్థులు వారి చదివే రోజుల్లో చేసిన అల్లరి, ఆటపాటలు, గురువులు చెప్పిన పాఠాలు గుర్తు చేసుకున్నారు. ఉత్తమ విద్యా బోధనతో తమ జీవితాను తీర్చిదిద్దిన గురువులను స్మరించుకొని వారి ఘనంగా సత్కరించారు. తమకు విద్యను అందించి, ఉన్నతంగా తీర్చి దిద్దిన పాఠశాల అవసరాలకు గివింగ్ బ్యాంక్ నిధిగా రూ. 1.50 లక్షల అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందలూరు గిరిజ, విశ్రాంత ప్రధనోపాధ్యాయులు నార్ని తాతయ్య, రామిశెట్టి శ్రీనివాసరావు, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారయణ, పాఠశాల వ్యవస్థాపక ప్రతినిధులు అడ్డగడ సుబ్బయ్య, బసవేశ్వరరావును సత్కరించారు. దివంగతులైన ఉపాధ్యాయుల సేవలను స్మరించుకొని శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ రావి శ్రీనివాసరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



చందలూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో రిటైర్ హెచ్‌ఎంను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తీరంలో సందడే సందడి!



తీరం ఒడ్డున సముద్రపు ఇసుకతో ఆడుకుంటున్న పర్యాటకులు



వాడరేవు సముద్రంలో స్నానం చేస్తున్న దృశ్యం

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు తీరంలో సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు, భక్తులు గంగమ్మకు పూజలు ఆదివారం నిర్వహించి సముద్ర స్నానం చేయించారు. మండలంలోని వాడరేవు సముద్రతీర ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది. ఎండలు విపరీతంగా కాస్తుండటంతో తీరం ఒడ్డున సేదతీరేందుకు పర్యాటకులు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలకు చెందిన ప్రజలతో పాటు గుంటూరు, విజయవాడ తదితర పట్టణాలకు చెందిన వారు సైతం కుటుంబ సభ్యులతో తీరానికి చేరుకుని సముద్రంలో స్నానాలు ఆచరించి ఆనందంగా గడిపారు. ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామికి పూజలు చేశారు.

సౌకర్యాలు శూన్యం

సెలవుదినాల్లో వాడరేవుకు పర్యాటకులు అధికంగా వస్తారని తెలిసినప్పటికీ పంచాయతీ అధికారులు తీరం ఒడ్డున కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయారు. సముద్రంలో స్నానం ఆచరించిన మహిళలు బట్టలు మార్చుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. తీరం ఒడ్డున మంచినీటి సౌకర్యం లేక యాత్రీకులు అవస్థలు పడ్డారు. అధికారులు తీరును పర్యాటకులు విమర్శిస్తున్నారు.

దుకాణాల వద్దే రేషన్ కొనుగోలు చేయాలి

జె.పంగులూరు: ప్రతి లబ్ధిదారుడు వారి పరిధిలోని రేషన్ దుకాణాల వద్దే రేషన్ కొనుగోలు చేయాలని తహసీల్దార్ సింగరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలో 6 రేషన్ షాపులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు ఎక్కడ అక్రమాలకు తావులేకుండా బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. మండల పరిధిలోని మొత్తం 34 రేషన్ షాపులకు గాను 14896 రేషన్ కార్డులున్నట్లు తెలిపారు. ప్రతి షాపులో ఇ- పాస్ మిషన్లు సక్రమంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి పంపిణీ చేయాలని, అక్రమాలకు పాల్పేడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అద్దంకి: ప్రజలకు ఇంటి వద్దనే రేషన్ అందించాలనే సదుద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ పంపణీకి కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టింది. ఎండీబీయూ ఆపరేటర్లను నిలిపివేస్తూ జీఓ జారీ చేసింది. దీంతో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఆదివారం నుంచి రేషన్ దుకాణాల్లో రేషన్‌ను పంపిణీ చేయడం ప్రారంభించింది. అయితే ఈ పంపిణీ విధానం సరైంది కాదని వామ పక్షాలు, ప్రతిపక్షం మొత్తుకున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. మరో వైపు ఎండీయూ ఆపరేటర్లు తమ ఉపాధి పోయిందని, తమ పొట్ట కొట్టవద్దని వేడుకున్నా వినలేదు. అద్దంకి మునిసిపల్, మండలంలోని 26 గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ మొదలైంది. తహసీల్దార్ శ్రీచరణ్ ఆదివారం బొమ్మనంపాడు, చక్రాయపాలెం గ్రామాల్లో రేషన్ దుకాణాలను ప్రారంభించారు.



అద్దంకి: రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీచరణ్

బల్లికురవ: చౌకదరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ రవి నాయక్ కోరారు. ఆదివారం 41 చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేపట్టారు. తూకంలో వ్యత్యాసాలు లేకుండా స్టాక్ రిజిస్టర్‌లు, బోర్డులో నిల్వలు ఉండాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుంటుపల్లి, బల్లికురవ, ఉప్పుమాగులూరు గ్రామాల్లో తహసీల్దార్ పర్యవేక్షించారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి రూరల్: అద్దంకిలోని కాకాని పాలెం, దామావారిపాలెం, దర్శిరోడ్డు, గుంజివారిపాలెం, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈమేరకు ఏఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు

చీరాల అర్బన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులచే నీతి కథలు, జాతీయ నాయకుల జీవితచరిత్రలను చదివి వినిపించారు. అలానే పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అలానే స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ఈనెల 3న వ్యాసరచన, 4న చిత్రలేఖనం, 5న క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన హైస్కూల్ హెచ్‌ఎంలు



కారంచేడు హెచ్‌ఎం సామ్రాజ్యంను సత్కరిస్తున్న హైస్కూల్ స్టాఫ్

కారంచేడు: మండలంలోని కుంకలమర్రు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా బొప్పూడి బాలప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవన జరిగిన ప్రధానోపాధ్యాయుల సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన మార్టూరు మండలం కోనంకి ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం పద్మావతి వేటపాలెం మండలం కఠారివారిపాలెం గ్రామానికి బదిలీపై వెళ్ళారు. హెచ్‌ఎంను గ్రామస్తులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

కారంచేడు హైస్కూల్‌కు సామ్రాజ్యం..

గత రెండు సంవత్సరాలుగా మూతబడి ఉన్న గ్రామానికి తలమానికంగా ఉన్న యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా నతాని సామ్రాజ్యం ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈమె గుంటూరు జిల్లా చౌట్ర ఉన్నత పాఠశాల నుంచి పదోన్నతిపై గ్రేడ్-2 హెచ్‌ఎం బదిలీపై వచ్చారు. ఆమెను గ్రామానికి చెందిన పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): లారీ క్రాస్ చేసే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి సంతమాగులూరు మండలంలో చోటు చేసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై పట్టాభిరామయ్య తెలిపిన వివరాల మేరకు.. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన బత్తుల బసవయ్య (45), చల్లా శ్రీనివాసరావు బైక్‌పై ఆదివారం రాత్రి బైకుమీద ఇరువురు కలిసి ఏల్చూరు నుంచి పుట్టావారిపాలెం మీదుగా గంగన్న పాలెం వెళుతున్నారు. ఈ క్రమంలో పుట్టావారిపాలెం దాటిన తరువాత చెన్నై నుంచి హైదరాబాద్ వెళుతున్న పెయింట్ లోడు లారీని క్రాస్ చేసే క్రమంలో లారీని తగలడంతో బైక్‌పై నుంచి కిందపడి బత్తుల బసవయ్య (45) అక్కడికక్కడే మృతి చెందాడు. చల్లా శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలవటంతో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.